ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 7 సెప్టెంబరు 2024





రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

# జిల్లాలో ఐటీ కారిడార్

- సుల్తానాబాద్‌లో 10 ఎకరాలు కేటాయింపు
- ముందుగా స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటు
- ఆ తర్వాత ఐటీ కారిడార్‌గా విస్తరణ
- మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ





(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాకు కొన్ని ఐటీ పరిశ్రమలను తీసుకవచ్చి కారిడార్‌ను ఏర్పాటుచేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆలోచన చేస్తున్నారు. ముందుగా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజవర్గాల్లో స్కిల్ డెవలప్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రామగుండంలో ఇటీవలనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి స్కిల్ డెవలప్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పెద్దపల్లి నియోజక వర్గంలోని సుల్తానాబాద్‌లో స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ శాఖాధికారులు స్థల సేకరణ చేస్తున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సైతం స్కిల్ డెవలప్ సెంటర్‌ను తమ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఇదివరకే మంత్రిని కోరారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్ సెంటర్‌కు సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్‌లోగల సర్వే నంబర్ 228లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అలాగే పట్టణంలోని సర్వే నంబర్ 779, 229లో కూడా ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. సుల్తానాబాద్ పట్టణం రాజీవ్ రహదారిని ఆను కుని ఉంది. అలాగే పెద్దపల్లిలో రైల్వే జంక్షన్‌తో రైల్వే కనెక్టివిటీ, అటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రం సమీపంలోనే ఉండడంతో శాస్త్రీనగర్‌లోనే స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పది ఎకరాల స్థలం ఉండడంతో భవిష్యత్‌లో ఆ స్థలాన్ని ఐటీ కారిడార్‌కు ఉపయో గించు కోవాలని మంత్రి శ్రీధర్ బాబు ఆలోచన చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కావడంతో పలు ఐటీ కంపె నీలకు తీసుకవచ్చి స్థానికంగా ఉండే నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, దక్షిణ కొరియా, దావోస్‌లలో పర్యటించారు. రాష్ట్రంలో పలు ఐటీ, సంబంధిత కంపెనీలను ఏర్పాటుచేసేందుకు ఆయా సంస్థలకు ముందుకు వచ్చాయి. సుమారు 36వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి.

## నిరుద్యోగులపై ఆర్థిక భారం..

జిల్లాలో అనేక మంది బీటెక్, డిగ్రీలు, పీజీలు చేసి చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ, ఇతర ఉద్యోగాల కోసం హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకోవాలంటే ఆర్థికభారం అవుతున్నది. దీంతో కొద్దిరోజుల పాటు శిక్షణ పొంది, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తిరిగి స్వగ్రామాలకు వస్తున్నారు. డిగ్రీలు పూర్తిచేసిన తర్వాత నైపుణ్య శిక్షణ ఇస్తే సులువుగా ఉద్యోగాలు సాధించే అవకాశాలుంటాయి. అందుకే జిల్లాలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కేంద్రాల ద్వారా ఐటీ, తదితర ఉద్యోగాలు పొందేందుకు కావాల్సిన శిక్షణతో స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. మంథనిలోనూ ఒక స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో మంత్రి ఉన్నారు. ఇందుకు కావాల్సిన స్థల సేకరణ కోసం రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌లో 10 ఎకరాల స్థలాన్ని ఐటీ కారిడార్‌కు కలెక్టర్ కేటాయించారు. మరికొద్ది రోజుల్లో స్కిల్ డెవలప్ సెంటర్‌ను మంజూరు చేయనున్నారని ఎమ్మెల్యే విజయమరమణారావు పేర్కొన్నారు.

## రామగుండం ఎన్టీపీసీకి అంతర్జాతీయ స్థాయి పురస్కారం

### - క్లీన్ ఎనర్జీ మినిస్టీరియల్ నుంచి ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇన్‌సైట్ అవార్డు

జ్యోతినగర్, సెప్టెంబరు 6 : రామగుండం ఎన్టీపీసీకి మరో అంతర్జాతీయ స్థాయి పురస్కారం లభించింది. క్లీన్ ఎనర్జీ మినిస్టీరియల్ అనే అంతర్జాతీయ సంస్థ రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇన్‌సైట్ అవార్డు 2024ను శుక్రవారం ప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమంగా పనిచేస్తున్నందుకు ఈ అవార్డు లభించింది. ఐఎస్‌వో 50001 స్థాయిలో పర్యావరణహిత ప్రాజెక్టు నిర్వహణకు రామగుండం ప్రాజెక్టును క్లీన్ ఎనర్జీ మనిస్టీరియల్ (సీఈఎం) సంస్థ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలుస్తున్నది. రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు నాయకత్వంలోని ప్రాజెక్టులో అమలు చేస్తున్న ఉత్తమ ఎనర్జీ మేనేజ్‌మెంట్ విధానాల వల్ల అంతర్జాతీయ గుర్తింపు లభించిందని ప్రాజెక్టు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ పురస్కారం లభించడంపై ఈడీ కేదార్ రంజన్ హర్షం వ్యక్తంచేశారు.

## డ్రైవర్లకు అవగాహన

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 6: మాదక ద్రవ్యాలపై శుక్రవారం రవాణాశాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టీవో రంగారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. మాదక ద్రవ్యాలు సేవించినా, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ట్రాఫిక్ అనిల్, సీఐ ఎక్సైజ్ శిరీష, ఎంవీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### - రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 6: మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 91మంది లబ్దిదారులకు రూ.91.10లక్షల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారితనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, రామగుండం తహసిల్దార్ కుమార స్వామి, కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

### రామగుండం అభివృద్ధికి ప్రత్యేక నిధులు..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 6: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ.200కోట్ల నిధులు తీసుకువచ్చినట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం దుర్గానగర్ లేఅవుట్‌లోని లంచ్ భవన్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొందల గడ్డగా మారిన రామగుండానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను త్వరలోనే ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రామగుండం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### మండపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

గణేష్ నవరాత్రులు సందర్భంగా 7వ డివిజన్ ఉదయ్‌నగర్‌లో డివిజన్ కార్పొరేటర్ వేగోళపు రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, గంగ శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు కొలువుదీరనున్న గణనాథులు

పెద్దపల్లి కల్చరల్ సెప్టెంబర్ 6: వినాయక చవితిని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలో మండపాలను ముస్తాబుచేశారు. గతేడాది 200 విగ్రహాలకు పైచిలుకు ఏర్పాటుచేయగా ఈసారి కూడా ముందస్తుగా ఆయా మండపాల నిర్వాహకులు పర్మిషన్ తీసుకొని సిద్ధం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండపాలకు ఉచిత విద్యుత్తు అని తేల్చడంతో ఆయా కాలనీల మండపాల నిర్వాహకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలోని జెండా కూడలిలో మట్టి వినాయకుల విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. శివాలయం, అమర్‌నాథ్‌చౌరస్తా, వైశ్య భవన్‌లోనూ మండపాలు ముస్తాబుచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మట్టి వినాయక విగ్రహాన్ని సిద్ధంగా ఉంచారు. శనివారం నుంచి పూజలు నిర్వహించనున్నారు.

**మంథని :** పట్టణంలోని రావులుచెరువుకట్టలో ఏటా ఏర్పాటుచేసే గణపతి శత వసంతోత్సవ వేడుకలు శనివారం జరుపుకోనున్నారు. స్థానికులు 1924లో తొలుత ఆర్‌సీకట్టలో గణపతి విగ్రహాన్ని నెలకొలిపి పూజించడం ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తుండటంతో ఈఏడాదికి వందేళ్లు నిండాయి. ప్రస్తుతం స్థానిక ఆర్‌సీ కట్టలోని శ్రీహనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం శనివారం నుంచి పూజలందుకోనున్నది.

**సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలో వినాయక మండపాలు సిద్ధం అయ్యాయి. శుక్రవారంతో మండపాల ఏర్పాటు పూర్తికాగా కొన్నిచోట్ల గణనాథుని విగ్రహాలు కొలువుదీరాయి. పట్టణంలోని గౌడవీధి, గంగపుత్ర వాడ తదితర ప్రాంతాల్లో విగ్రహాలను సిద్ధంగా ఉంచారు.

## గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### - కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్ సెప్టెంబరు 6:సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అన్ని విధాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ గురుకులపాఠశాల ప్రిన్సిపాల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో అదనపుకలెక్టర్ జెఅరుణశ్రీ కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పంచాయతీరాజ్ అధికారులు పర్యటించి కావలసిన మౌలిక సదుపాయాల వివరాలు సేకరించి వాటికి ఎస్టిమేషన్ వేసి పనులను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### ఫుడ్ కోర్టును ప్రారంభించిన కలెక్టర్

పెద్దపల్లిటౌన్ : కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళ శక్తి మెప్మా ద్వారా పల్లెర్ల సౌజన్య ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును శుక్రవారం కలెక్టర్ శ్రీహర్ష ప్రారంభించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, మంథని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, సుల్తానాబాద్ మేనేజర్ అలీం తదితరులున్నారు.





## పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా పండుగలు జరుపుకోకూడదు

### - అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మట్టి గణపతులను అందజేస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్ సెప్టెంబరు 6: పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా పండుగలు జరుపుకోకూడదని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ద్వారా ఏర్పాటు చేసిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూర్వకాలంలో పసుపు ముద్దలతో తయారు చేసిన గణపతులను పూజించేవారని, ఆ తరువాత మట్టితో తయారుచేసిన గణపతులను ఇంట్లో పెట్టుకొని పూజించేవారనీ, ఇప్పుడు రకరకాల రంగులతో రసాయనాలతో కూడిన గణపతులను పూజిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి కార్యాలయ సిబ్బందికి మట్టి గణపతులను అందించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బీ బిక్షపతి, ఏఈ వీరేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేను విజయవంతం చేయాలి

### - మున్సిపల్ చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, సెప్టెంబరు 6: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇంటింటా సమగ్ర సర్వేను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటింటా సర్వేపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెప్మా ఆర్పీలు, ఓటీలు అన్నివార్డుల్లో చేసే సర్వేలో ఎవరి ఎలాంటి శిక్షణలు, ఆర్థిక సహాయం అవసరమో, సంఘాల్లోని వారిని కొత్త సభ్యులు చేయడం లాంటి అంశాలను నమోదు చేయాలని సూచించారు. ఈనెల 16 వరకు ఇంటింటా సర్వేను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కమీషనర్ మల్లిఖార్జున్, డీఎంసీ సతీష్, ఏడీఎంసీ మౌనికలు పాల్గొన్నారు.

## జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

పెద్దపల్లి(ఆంధ్రజ్యోతి), జూలపల్లి, ఎలిగేడు, సెప్టెంబరు 6 : జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీచేస్తూ కలెక్టర్ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మారం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ రజితను పెద్దపల్లి ఆర్‌డీవో కార్యాలయంలో డీఏవోగా, కమాన్‌పూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎండీ ఆరీఫొద్దీన్‌ను ధర్మారం మండలానికి బదిలీచేశారు. జూలపల్లి మండల తహసీల్దార్ ఎండీ బషీరుద్దీన్‌ను ఎలిగేడు మండలానికి, అక్కడ పని చేస్తున్న జె స్వర్ణను జూలపల్లి మండలానికి బదిలీ చేశారు. పెద్దపల్లి డీఏవోగా పని చేస్తున్న ఎం వాసంతిని కమాన్‌పూర్ మండల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. దీంతో శుక్రవారం జూలపల్లి, ఎలిగేడు రెవెన్యూ కార్యాలయాల్లో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్టిజన్‌లు

## సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలి

### - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆర్టిజన్‌ల వినతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 6: ఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమని శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆర్టిజనల్ కార్మికులు జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా జీవనరెడ్డి మాట్లాడుతూ ఆర్టీజన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏపీఈఎస్‌బీ రూల్స్ వర్తింపజేసేలా చొరవ చూపుతానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సీఎం సైతం చొరవచూపుతారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

# ఉధృత గోదావరిని దాటలేక..

● తెలంగాణ భూభాగంలో నిలిచిపోయిన మావోయిస్టులు ● ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీసులు, కూంబింగ్‌తో మూల్యం

● 2 నెలలుగా ములుగు, భద్రాద్రి ఏజెన్సీలో లచ్చన్న దళం ● ఈ క్రమంలోనే రఘునాథపాలెం ఘటన

హైదరాబాద్, చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతోపాటు తెలంగాణలో పట్టు సాధించేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పుడు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు. కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కి సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీస్‌లు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరోవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంత కాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల పోలీస్‌లు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్రనేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపుర్, బీజాపూర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

### ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక.. మావోయిస్టు పార్టీలో ఎన్నడూ లేని విధంగా విభేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

### తెలంగాణలో అడుగుపెట్టనివ్వం - డీజీపీ జితేందర్

తెలంగాణలో మావోయిస్టులకు స్థానం లేదని, రాష్ట్రంలో వారు అడుగు పెట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పునరావాసం, ఆర్థిక సాయంతో సాధారణ జీవితం కొనసాగించాలన్నారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## జ్వరంతో మహిళ మృతి

రుద్రంగి, సెప్టెంబరు 6 : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చలిగటి లక్ష్మి (50) జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన లక్ష్మి వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఇంటి వద్ద చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స పొందింది. అక్కడ ప్లేట్‌లెట్స్ తగ్గడం, పరిస్థితి విష మించడంతో శుక్రవారం సాయంత్రం వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన వెంటనే లక్ష్మి మృతి చెందింది. లక్ష్మికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 6:బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చీపెల్లి మల్లయ్యకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నిందితుడు చీపెల్లి మల్లయ్య డిసెంబరు 25, 2018న మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడని తెలిపారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మల్లయ్యను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రేమలత మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

## బాండ్స్ డబ్బులు చెల్లింపుపై హర్షం

భగత్‌నగర్, సెప్టెంబరు 6: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పీఆర్‌సీ- 2013 బాండ్స్ డబ్బులను కండక్టర్స్‌కు చెల్లించడంపై జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో-కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాద్‌లు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. దసరా పండుగకు బాండ్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. దీనితో పాటు గ్యారేజ్‌సిబ్బంది, వర్క్ షాపు సిబ్బంది, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది ఉద్యోగులకు బాండ్ డబ్బులు చెల్లించాలని జేఏసీ పక్షాన డిమాండ్ చేశారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

మెట్‌పల్లి, సెప్టెంబరు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్మూర్ రోడ్డులో అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు మహిళను ఢీకొట్టగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పట్టణంలోని డీడీనగర్ కాలనీకి చెందిన నలివేని ఎల్లమ్మ (43) ఈ నెల 2న మెట్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు వెళ్లే రోడ్డులో మనోహర గార్డెన్స్ ఎదుట రాత్రి 10:30 సమయంలో రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మెట్‌పల్లి పోలీసులు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

● తహసీల్దార్, ఎంపీడీవోలకు వెంగళాపూర్ గ్రామస్థుల వినతి

గొల్లపల్లి, సెప్టెంబరు 6: ఇప్పటివరకు స్వచ్ఛంగా ఉన్న తమ గ్రామంలో కొందరు వ్యక్తులు బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మించి గ్రామాన్ని కలుషితం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, రైస్ మిల్లు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దంటూ మండలంలోని వెంగళాపూర్ గ్రామస్థులు తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి ఆయా శాఖల అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇద్దరు, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కలిసి గ్రామానికి పై భాగాన సుమారు 800 మీటర్ల దూరంలో బాయిల్డ్ రైస్‌మిల్లును నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణం సమీపంలో గ్రామానికి చెందిన మంచినీటి బావితో పాటు ప్రాథమిక పాఠశాల ఉందని, దీనివల్ల గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యాలపాలవుతామని భయాందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థుల అభీష్టానికి వ్యతిరేకంగా రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇస్తే ఊరుకునేది లేదని, దేనికైనా తెగిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు గ్రామానికి సహకరించి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని, గ్రామాన్ని కాపాడాలని సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, రాజేందర్, హన్మయ్య పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

కొడిమ్యాల, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం తహసీల్దారు విధులకు ఉదేశ పూర్వకంగా ఆటంకం కలిగించిన అయిత శ్రీనివాస్, అయిత గణేష్‌పై తహసీల్దారు బి. రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... నిందితులు పురుగుల మందు డబ్బాతో కర్రను చూపుతూ తహసీల్దారు డౌన్‌డౌన్ అని స్టిక్కర్లను చూపారన్నారు. తమ భూమిని సర్వే చేయించాలని డిమాండ్ చేశారన్నారు. పురుగుల మందు తాగి మరణిస్తామని ప్రజల సమక్షంలో విధులకు ఆటంకం కలిగించారని తహసీల్దారు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బీసీ రాజ్యాధికార సమితి అడ్‌హక్ కమిటీల నియామకం

### బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్

గణేశ్‌నగర్,సెప్టెంబరు 6: త్వరలో తెలంగాణ రాష్ట్ర బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నియోజకవర్గ, మండల అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు బీసీ రాజ్యాధి కార సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీల సమస్య ల ప్రధాన ఎజెండాగా బీసీ రాజ్యాధికార సమితి నిరంతరం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని బీసీ లకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తుందన్నారు. బీసీల సమస్యల పై పోరాడే నాయకులు ముందుకు వచ్చి బీసీ రాజ్యాధికార సమితిలో పనిచేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థలలో పోటీ చేసే నాయకులు బీసీ రాజ్యాధికారి సమితిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు.

## ట్రాన్స్ ఫార్మర్ పైనుంచి పడి లైన్‌మన్‌కు గాయాలు

చందుర్తి, సెప్టెంబరు 6: చందుర్తి మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మ చేస్తున్న లైన్‌మన్ శుక్రవారం పైనుంచి కింద పడడంతో గాయపడ్డాడు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై లైన్‌మన్ కొత్త తిరుపతిరెడ్డి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తిరుపతిరెడ్డికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు.

## పందివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

చొప్పదండి, సెప్టెంబరు 6: మండలంలోని ఆర్నకొండ రాగంపేట మధ్యలో ఉన్న పందివాగుపై హైలెవెల్ వంతెనను నిర్మించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్నకొండ నుంచి రాగంపేట వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతి న్నదని చెప్పారు. ఆర్నకొండ గోపాలరావుపేట రోడ్డు ధ్వంసమైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికి సైతం రాగంపేట నుంచి గోపాల్‌రావుపేట వరకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పందివాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు.

## ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 50,350 | 7,882 | 80.5 | 76.894 |
| ఎల్లంపల్లి | 15,719 | --- | 20.175 | 19.202 |
| మిడ్ మానేరు | 3,216 | 6,400 | 27.54 | 23.144 |
| ఎల్ఎండీ | 11,406 | 294 | 24.034 | 20.268 |

## శ్రీరాంసాగర్‌కు 42,740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జలకళను సంతరించుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి శుక్రవారం ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 76.8 94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర అవసరాలకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు మూసివేత

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు వరద గేట్లను మూసివేశారు. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 15,719 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3841 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 11,878 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.202 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

### మిడ్ మానేరుకు 3,216 క్యూసెక్కులు రాక

బోయినపల్లి, సెప్టెంబరు 6: మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి 2,200 వేలు మూలవాగు, మానేరు వాగు ద్వారా 1,016 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వా యర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 316.215 ఉండగా, నీటి నిల్వ సామ ర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.144 టీఎంసీల మేర చేరుకుంది.

### ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో


ఎల్ఎండీలో ఉన్న నీటి నిల్వలు

తిమ్మాపూర్, సెప్టెంబరు6: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు తగ్గాయి. ఎల్ఎండీలోకి ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 9,856 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండీ నుంచి 1,550క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మొత్తం 11,406 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీ లోకి వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో 294 క్యూసెక్కులు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.268 టీఎంసీలకు చేరుకున్నది.

### రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 95క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,300 రూపాయలు చెల్లించారు.

### వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకోవాలి

సైదాపూర్, సెప్టెంబరు 6: విద్యుత్ వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకొని కరెంటు వాడుకోవాలని కరీంనగర్ ఎస్ఈ వి గంగాధర్ అన్నారు. గొడిశాల గ్రామంలో విద్యుత్‌శాఖ నిర్వహిస్తున్న నూతన కరెంటు మీటర్ల దరఖాస్తుల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వినియోగదారులకు తగు సూచనలు చేశారు. 500ల వోల్టేజ్ లోడు లోపు కరెంటు కనెక్షన్ కోసం రూ. 938 చెల్లించాలని చెప్పారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు జీరో బిల్లు నమోదు అవకాశాన్ని తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారందరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ బొమ్మ అంజనేయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని చెప్పారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లలోపు ఉండాలని తెలిపారు.

# ధాన్యం టెండర్ల పరిశీలన

- రామగుండం సెక్టార్‌కు ఒకటే టెండర్
- సద్దుమణిగిన కాంట్రాక్టర్ల మధ్య వివాదం
- మాట్లాడిన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్


మాట్లాడుతున్న అదనపు జేసీ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం రవాణా చేసేందుకు దాఖలైన టెండర్లను అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తెరిచారు. టెండర్ల దాఖలకు ఈనెల 5వ తేదీ చివరి తేదీ కాగా, పెద్దపల్లి సెక్టార్‌కు ఒకటి, సుల్తానాబాద్ సెక్టార్‌కు 2, మంథని సెక్టార్‌కు 2, రామగుండం సెక్టార్‌కు ఒక టెండర్ దాఖలయ్యింది. ఆ టెండర్లను అదనపు కలెక్టర్ కాంట్రాక్టర్ల సమక్షంలో తెరిచి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్లలో తక్కువ ధర కోట్ చేసిన వారిని ఈనెల 9వ తేదీన పిలుస్తామని చెప్పారు. గురువారం టెండర్ల సందర్భంగా రామగుండం సెక్టార్‌కు లక్ష్మన్ కుమార్ కాంట్రాక్టర్ దాఖలు చేసిన టెండర్ ఫారాన్ని రామగుండం లారీ ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు లాక్కోవడంతో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో టెండర్ ఫారాన్ని లాక్కువెళ్లిన వారిపై స్థానిక పోలీసులకు పౌరసరఫరాల సంస్థల జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు మరొక సెట్ అందజేయాలని లక్ష్మన్‌కుమార్‌కు అవకాశం కల్పించారు. టెండర్లు తెరిచే సమయానికి లక్ష్మన్ కుమార్ మరొక సెట్ దాఖలు చేయలేదు. ఆయనకు మొదట మద్దతుగా నిలిచిన పాలకుర్తి లారీ అసోసియేషన్‌కు చెందిన వాళ్లు రామగుండం లారీ అసోసియేషన్ వాళ్లతో కాంప్రమైజ్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన రామగుండం నియోజకవర్గ నేత జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగిందని సమాచారం.

# ఇంట్లోకి వెళ్లిన కోతులు

- గడియ పడడంతో కిటికీ ఊచలు తొలగించిన యజమాని


ఇంటిపై ఉన్న కోతులు(ఇన్‌సెట్‌లో ఇంట్లోకి దూరిన వానరం)

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి రెండు కోతులు ప్రవేశించాయి. అనంతరం తలుపులకు గడియ పడిపోవడంతో బయటకు రాలేకపోయాయి. ఆగ్రహంతో ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందర చేశాయి. సుమారు నాలుగు గంటల పాటు కోతులు ఇంట్లోనే ఉండిపోయాయి. గమనించిన ఇంటి యాజమాని కిటికి ఊచలను తొలగిం చడంతో కోతులు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాయి. తీవ్ర ఆగ్రహంతో ఉన్న కోతులు తమను పై దాడి చేయకుండా కొబ్బరి చిప్పలు, అరిటి పండ్లు పెట్టడంతో వాటిని తీసుకొని బయటకు పరిగెత్తాయి. కాగా మండల కేంద్రంలో వానర సైన్యం బెంబెలెత్తించింది. పెద్ద సంఖ్యలో ఇళ్ల పరిసరాల్లో తిష్ఠ వేసి హంగామా సృష్టిస్తున్నాయి. ఇళ్లపైకి ఎక్కి పెంకులను తొలగిస్తున్నాయి. ఇళ్లల్లో ప్రవేశించి ఆహార వస్తువులు చిందరవందర చేస్తున్నాయి. అధికారులు కోతుల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాలుర అండర్-15 హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు గోపాల్‌రావుపేట, కోహెడ, సిరిసిల్ల, కరీంనగర్, కోరుట్ల, జగిత్యాల, వెలిచాల, కొత్తపల్లి, గంగాధర, పెద్దపల్లి, జమ్మికుంట, హుస్నాబాద్, కాటారం ప్రాంతాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, హెచ్ఎం పద్మజ, పీహెచ్ఎస్ హెచ్ఎం రత్నాకర్ రెడ్డి మొదట క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.జిల్లా జట్టుకు ఎంపికైన ఆటగాళ్లు ఈ నెల 14,15వ తేదీల్లో హనుమకొండ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ స్వరూపరాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కాటారం కోచ్ మాల వెంకటేష్, సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ప్రేమ్‌కుమార్, పీడీ హను, పీఈటీలు అమర్, సాయి, శివాజి, శ్రీకాంత్, కవిత, కనకలక్ష్మి, రాకేష్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

### వర్గీకరణ సదస్సుకు తరలిరావాలి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ కోరారు. జమ్మికుంటలో శుక్రవారం చలో కరీంనగర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు మాదిగ ఉప కులాలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైన సాంబయ్య, రాచపల్లి వంశీకుమార్, పుల్యాల నరేష్, పోడేటి వేణు, సలిగంటి సతీష్, వడ్లూరి అరుణ్, కొలుగూరి రవీందర్, శనిగరపు యుగేందర్, దొగ్గల రవీందరర్, తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నం:** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, కిష్టయ్య, శంకర్, భాస్కర్, రాజయ్య, ఓదెలు, శ్రీనివాస్, సతీష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలు 23 ఆపరేషన్లు

- వేములవాడ సర్కారు ఆస్పత్రిలో మరో రికార్డు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 6: ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయని పేద ప్రజల్లో నమ్మకం కలిగించే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రభుత్వ అసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆపరేషన్లు చేస్తూ రికార్డులు నెలకొల్పుతున్నారు. గత నెల 24వ తేదీన 24 గంటల్లో 17 వివిధ రకాల ఆపరేషన్లు చేసి ఆదర్శంగా నిలిచారు. తాజాగా గురువారం నుంచి శుక్రవారం వరకు వేములవాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేశారు. వాటిలో పది సీజేరియన్ డెలివరీలు, రెండు గర్భసంచిలో గడ్డలు, ఐదు సాధారణ శస్త్ర చికిత్సలు, ఒకటి కంటి, ఐదు ఆర్థో ఆపరేషన్లు ఉన్నాయి. సూపరింటెండెంట్, సర్జన్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నమాల, డాక్టర్ అనిల్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ తిరుపతి ఇతర సిబ్బంది ఆపరేషన్లు చేసి ఏరియా ఆస్పత్రిపై నమ్మకాన్ని పెంచారు. 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేసిన సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బందిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.

# కార్పొరేటర్ భర్త అరెస్టు

- 14 రోజుల రిమాండ్
- జైలుకు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో దరుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడినందుకు కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టాణా సీఐ సరిలాల్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సూపర్వైజర్ చాంబర్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించిన మెండి చంద్రశేకర్ ఓ ఫైల్ గురించి అడుగుతూ తనను చేతులతో కొట్టి దుర్భాషలాడి, చంపేస్తానంటూ అసభ్యంగా ప్రవర్తించాడని టీపీఎస్ తేజశ్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తను ఫైల్‌ను తీస్తుండగా తన నుంచి బలవంతంగా ఫైల్ తీసుకుని కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తాను కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లగా తనను వెంబడించిన కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కమిషనర్‌ను కూడా దుర్భాషలాడాడని, విధులను ఆటంకించడంతో పాటు తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు టీపీఎస్ తేజశ్విని ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం రాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుని టాణాకు తరలించారు. శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

### విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6 : విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన మలగల సదానందం అలియాస్ ఆరెపల్లి సదయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి హేమంత్ తీర్పు వెలువరిస్తూ 15,169 రూపాయల జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించారని సీఐ తెలిపారు. అలాగే చొప్పదండి మండలం మల్లన్నపల్లి గ్రామపరిధిలోని కాట్నపల్లికి చెందిన బండారి యాదగిరికి విద్యుత్ చౌర్యం కేసులో కరీంనగర్ జిల్లా ఉప అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరిస్తూ 4,371 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్షను విధించారని సీఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఒడ్డెలింగాపూర్-భూపతిపూర్ మార్గ మధ్యలో శుక్రవారం కిష్టంపేట గ్రామానికి చెందిన దానవేణి పోచయ్య ద్విచక్ర వాహనం పై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. అటువగా వెళ్తున్న యువకులు జక్కుల సాగర్, బందెల స్వామి, నలువాల రాములు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

### ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

- నిందితుడిపై కేసు, రిమాండ్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి 3 సంవత్సరాలుగా శారీరకంగా కలిసి, రెండు సార్లు అబార్షన్ కూడా చేయించి చివరకు మోసం చేసిన ఘటనపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన ఒక యువతి (23)ని అదే గ్రామానికి చెందిన సూరజ్‌కుమార్ అనే యువకుడు ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడు. రెండు మార్లు 6 నెలల గర్భాన్ని తొలగింపజేశాడు. చివరకు పెళ్లి ప్రస్తావన తేవటంతో మొహం చాటేసి వివాహం చేసుకోనని చెప్పా డు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు సూరజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాయికల్ పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన షేక్ అల్మాస్, షేక్ హైదర్‌లు మహేంద్ర బొలెరో వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టుకున్న వాహనంతో పాటు 30 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**ఇల్లంతకుంట:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. రేషన్ బియ్య ం తరలిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పొత్తూరు గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన పత్తి కళ్యాణ్ ఆటోలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఐదు క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు.


ఉప్పుమడుగు గ్రామంలో పట్టుకున్న రేషన్ బియ్యం

# క్రైం వార్తలు

### అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు 6: మండలంలోని నల్లగొండ గ్రామంలో ఓ యువకుడు అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండి ఎస్సై వివేక్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ గ్రామానికి చెందిన నర్రేంకుల నరేష్(35)కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేష్ తన ఇంటి అవసరాల నిమిత్తం హిందుస్థాన్ మైక్రో ఫైనాన్స్ అనే సంస్థలో ఐదు లక్షల రూపాయలు హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. తీసుకున్న లోన్ తీర్చలేక ఇబ్బందులు పడుతున్న నరేష్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

### ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

మానకొండూర్/ కరీంనగర్ క్రైం సెప్టెంబరు 6: మండలంలోని నిజాయితీగూడెం గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మూడు లీటర్ల నాటు సారా, 400 లీటర్ల నాటు సారాను తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం పానకం, 60కిలోల నల్ల బెల్లం, ఐకిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. కేశవపట్నం గ్రామానికి చెందిన కల్లూరి ఐలయ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ నాగేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ మోసీన్, ఖాసీం, కమలాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### వరద కాలువలో మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 6: గంగాధర మండలం ర్యాలపల్లి సమీపంలోని వరద కాలువలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం గుర్తించినట్లు ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ర్యాలపల్లి సమీపంలో వరద కాలువలో వ్యవసాయ పంపు సెట్టుకు మృతదేహం తట్టుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో యువకుడు మృతి చెంది ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపారు. కాలువ నుంచి శవాన్ని బయటకు తీశామని, అతని దుస్తుల్లో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మెట్‌పల్లికి చెందిన బొట్ల శ్రీనివాస్(35)గా గుర్తించామని తెలిపారు. ఇప్పటి వరకు శ్రీనివాస్ బంధువుల ఆచూకీ దొరకలేదని ఏఎస్ఐ చెప్పారు. వివరాలు తెలుసుకున్న అనంతరం పోస్టుమార్టం వరదకాలువ వద్దే నిర్వహించి మృతదేహాన్ని అప్పగిస్తామని ఏఎస్ఐ తెలిపారు.

# ఆర్ఎఫ్‌సీఎల్ నిర్లక్ష్యం

» మున్సిపల్ మురుగుకాల్వల్లోకి కెమికల్ వాటర్ » ఆమ్మోనియా వాసనతో గోదావరిఖని జనం అవస్థలు


ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ లెట్ నుంచి 7ఎల్ఈపీ డ్రైన్‌కు వస్తున్న వాటర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 6: ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ తన నిర్లక్ష్యాన్ని మరోమారు చాటుకుంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం కెమికల్ వాటర్‌ను శుద్ధి చేయకుండానే గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ఇప్పుడు కెమికల్ వాటర్‌ను మున్సిపల్ మురుగు కాల్వలోకి వదిలింది. గోదావరిఖని 7ఎల్ఈపీ, సంజయ్‌గాంధీనగర్ నాలాలకు కెమికల్ వాటర్‌వదిలారు. స్థానిక 7ఎల్ఈపీ గని పక్కనే ఉన్న పాత గ్లోబల్ వాషరీస్ వద్ద గల ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్‌లెట్ నుంచి, సంజయ్‌గాంధీనగర్ అవుట్‌లెట్ నుంచి శుక్రవారం రాత్రి 8గంటలకు పెద్ద ఎత్తున కెమికల్ వాటర్‌ను వదిలారు. దీంతో 7ఎల్ఈపీ కాలనీ, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్ ఏరియా పరిధిలోని మూడు డివిజన్ల ప్రజలు అతలాకుతలం అయ్యారు. సంజయ్‌గాంధీనగర్, ఒరియా కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, కాకతీయనగర్, కళ్యాణ్‌నగర్, ఉల్లిగడ్డల బజార్, గోదావరిఖని మార్కెట్ ఏరియా, సీతానగర్, లెనిన్‌నగర్ వాసులు వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యారు. వాటర్ నుంచి అమ్మోనియా గాలిలో కలుస్తుండడంతో కళ్లమంటలతో ఇబ్బందులు పడ్డారు. జనం ముఖానికి గుడ్డలు కట్టుకున్నారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ శ్రీహర్షకు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశంతో కమిషనర్ శ్రీకాంత్ డ్రైన్ల అవుట్ లెట్ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు.

### ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై క్రిమినల్ చర్యలు

ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై ప్రజల పక్షాన క్రిమినల్ చర్యలకు వెనుకాడేది లేదు. వందల కోట్లు లాభాలు గడిస్తున్నా కనీసం రక్షణ ప్రమాణాలు పాటించడం లేదు. నిర్లక్ష్యంగా మున్సిపల్ మురుగు కాల్వలోకి కెమికల్ వాటర్ వదిలారు. ప్రజలు, చిన్నపిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



విఠల్‌నగర్ డ్రైనేజీలో పారుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ నీరు, వాసన భరించలేక ముక్కుకు గుడ్డలు కట్టుకున్న స్థానికులు

# అంజన్న హుండీ ఆదాయం రూ.81లక్షలు


సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, సెప్టెంబరు 6: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవ స్థానానికి హుండీల ద్వారా రూ.81, 07,641 నగదు ఆదాయం సమకూరి నట్లు ఈవో ఎం.రామకృష్ణరావు తెలిపారు. 56 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించగా నగదుతో పాటు 14గ్రాముల మిశ్రమ బంగారం, 4.900కిలోల మిశ్రమ వెండి, 61విదేశి కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ వేంకటఅన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలి

» తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 6: బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెడుతున్నారన్నారు. దీనితో రైతాంగానికి జీవనోపాధికి ముప్పుగా పరిణమించిందన్నారు. దేశంలో అధిక భాగం రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని కౌలు రైతులు ఉన్నారన్నారు. బడా వ్యాపారవేత్తల డిజిటలైజేషన్‌లో వీరిని కూడా చేర్చినట్లయితే మొత్తంగా వ్యవసాయ ఉత్పత్తులపై కార్పొరేట్ ఆధిపత్యం పెరిగి పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని డిమాండ్ చేశారు.

## గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ అనుమతి పొందిన మండపాలకు ఉచిత విద్యుత్ - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 6: రామగుండం నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వివిధశాఖ అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో గణపతి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనంపై మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, పోలీస్, గణేష్ ఉత్సవ సమితి, విశ్వ హిందు పరిషత్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రుల ప్రారంభం అయ్యే శనివారం నుంచే నగరంలో పండుగ వాతావరణం కనిపించేలా కూడళ్లను సీరిస్ బల్బులతో అందంగా అలంకరించాలన్నారు. నిమజ్జనం రోజున గోదావరివంతెన, ప్రధాన చౌరస్తాలో అదనపు లైటింగ్‌కు, లైటింగ్‌కు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల గురించి ఎన్‌పీడీసీఎల్ సీఎండీతో ఎమ్మెల్యే మాట్లాడారు. నిమజ్జనానికి సంబంధించి రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి సంబంధించిన గణనాథులే కాకుండా శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి నుంచి పెద్దసంఖ్యలో గణనాథులు వస్తున్న దృష్ట్యా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మండపాల నిర్వాహకులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ గుర్తింపు ఉన్న అన్ని మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని పేర్కొన్నారు. గోదావరిలో వరద ప్రవాహం దృష్ట్యా వంతెనపై నుంచే నిమజ్జనం ఉంటుందని, నదిలోకి ఎవరిని అనుమతించరన్నారు. ఈ సమావేశంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, ఏసీపీలు మడక రమేష్, నర్సింహులు, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్ రావు, రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ కుమారస్వామి, సింగరేణి ఎస్ఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఎస్ఈ జే శ్రీనివాస్, వసంత్‌కుమార్, ఎన్‌టీపీసీ అధికారులు సూర్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు శుక్ల, వంశీకృష్ణ, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, ఎన్‌పీడీసీఎల్ ఏఈ హరీష్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురుమ సతీష్, జలేందర్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదే : ఏసీపీ రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మడత రమేశ్


ముత్తారంలో మాట్లాడుతున్న సీఐ రాజుగౌడ్

రామగిరి, సెప్టెంబరు 6: గణేష్ మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదేనని, తగిన జాగ్రత్తలు వహించాలని ఏసీపీ మడత రమేశ్ సూచించారు. గురువారం సెంటినరీకాలనీలోని సీఎస్‌సీవోఏ క్లబ్‌లో నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాట్లపై నిర్వాహకులు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి సమస్య ఉత్పన్నమైతే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మంథని సీఐ బొల్లపెల్లిరాజు గౌడ్, రామగిరి ఎస్ఐ చంద్రకుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

**ముత్తారం** : మండలం పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అని మంథని సీఐ రాజుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతిపత్రం పొందాలని సూచించారు. ఎస్సై గోపతి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

**కమాన్‌పూర్** : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కొట్టే ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల నిర్వాహణకు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

**మంథని** : శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మంథని ఆర్డీవో హనుమానాయక్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌లు సూచించారు. పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పీస్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. వినాయక మండపాలకు అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలన్నారు. సీఐ రాజు, డీటీ గిరి, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజిద్దాం



గోదావరిఖనిలో మట్టి వినాయకులను అందజేస్తున్న మనాలి ఠాకూర్, ఎన్‌సీపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణను కాపాడటానికి మట్టి గణపతులను పూజించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అఖిల భారత అసంఘటిత మహిళా ఉద్యోగుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు మాడెపు సరిత ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, రంగు రంగుల గణపతులను పూజించి వాటిని కుంటల్లో, చెరువుల్లో, నదుల్లో నిమజ్జనం చేయడంవల్ల నీరు కలుషితం అవుతున్నాయని, జీవరాశులు కూడా బతకడం లేదని, ఈ నీటిని మనం తాగడంవల్ల అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టిగణపతి విగ్రహాలను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌసియా, రామలింగేశ్వరి, సలేహా, బేగం, దాసరి స్వప్న పాల్గొన్నారు.

కాగా, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో స్వతంత్ర చౌక్‌లో మట్టి గణపతులను పంపిణీ చేశారు. అధ్యక్షులు నార్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మామిడిపెల్లి శ్రీధర్, దయానంద్‌గాంధీ, కోదాటి ప్రవీణ్, జయప్రకాష్, నరేష్, వినోద్, మల్లికార్జున్, రవీందర్, నటరాజ్, సతీష్, విజేందర్, సత్తయ్య, విక్రమ్, సంతోష్‌రావు పాల్గొన్నారు.

**కోల్‌సిటీటౌన్** : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొలుగూరి మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖనిలోని కాకతీయనగర్, నర్స్‌క్వార్టర్స్ ఏరియా ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల శ్రీధర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మట్టి గణపతులను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్, నాయకులు చెన్నూరి నాగరాజు, నాగుల శివకుమార్, కుమ్మరి నాగార్జున, సుందిళ్ళ సూర్యమణిదీప్, సాయి, మొగిలి, సతీష్, జేమ్స్ రెడ్డి, రత్నమధు, అబ్బోజు శ్రీదేవి, స్వప్న, విజయ, లలిత, విజయలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

కాగా, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎకో ఫ్రెండ్లీ గణేష్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలు వివిధ ఆకృతులలో తయారుచేసి వాటిని అలంకరించి ప్రదర్శించారు. అనంతరం మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా బహుమతులు ప్రదానం చేశారు. ఎకో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, క్లబ్ కోఆర్డినేటర్ సవిత, డాక్టర్ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్** : సుల్తానాబాద్ పట్టణంలోని యువ సంకల్ప ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేశారు. గాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిమల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తుమ్మ నిశాంత్, మాదారి సందీప్, వీరాచారి, సంపత్, కమలాకర్ పాల్గొన్నారు.

అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పూసాల మార్కండేయ దేవాలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు వల్స స్వరూప నీలయ్య సౌజన్యంతో విగ్రహాలను అందజేశారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జూలూరి అశోక్, భాస్కర్, మాటేటి శ్రీనివాస్ పాల్గొన్నారు

**పాలకుర్తి** : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. శుక్రవారం జీడినగర్ పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను బసంత్‌నగర్ ప్రాంతంలో పంపిణీ చేశారు. పోలీసులకు సైతం మట్టి విగ్రహాలను అందించారు. ఫ్యుచ్యూర్ గ్లోబల్‌ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులతో మట్టిగణపతులను తయారుచేయించి చవితి ప్రత్యేకతను వివరించారు. ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, బసంత్‌నగర్ ఎస్సై స్వామికి మట్టి గణపతిని అందిస్తున్న విద్యార్థులు

## జీఎం కార్యాలయాల్లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ఆర్జీ-2లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్జీ-3 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6: ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. జీఎం ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో జీఎం సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, అధికారులు ధనుంజయ, రాజన్న, నారాయణ, వంశీధర్ పాల్గొన్నారు.

**రామగిరి** : ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం సుధాకర్‌రావు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సింగరేణి రామగుండం ప్రాంతీయ కార్యాలయం వారి సహకారంతో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు జీఎం తెలిపారు. శుక్రవారం రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో కార్మికుల కుటుంబాలకు అందజేయనున్నట్లు తెలిపారు. అధికారులు వెంకటరమణ, శ్రీనివాసులు, రాజారెడ్డి, రాజశేఖర్, చంద్రశేఖర్, సుదర్శనం, అధికారులు పాల్గొన్నారు.

### పెచ్చులూడుతున్న వసతిగృహ భవనాలు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 6: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర కాలేజి హాస్టల్‌లో పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో విద్యార్థికి త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థులు హాస్టల్‌కు చేరుకొని హాస్టల్ పైకప్పును పరిశీలించారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దల సిద్ధార్థ్, అభి, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు

ఓదెల సెప్టెంబరు 6: మండలంలోని గూడెంలో ప్రభుత్వ భూమిని మాజీ సర్పంచ్ అక్రమంగా పట్టా చేసుకున్నారంటూ అదే గ్రామానికి చెందిన బండారి సుధాకర్ అనే వ్యక్తి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. గూడెం రెవెన్యూ శివారులో గల 11.13 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని 2007లో అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా పట్టా చేసుకున్నారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు.

### కారు డ్రైవర్ ఔదార్యం

రామగిరి, సెప్టెంబరు 6: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు చిట్టి మహేష్ అనే కారు డ్రైవర్ తన సొంత డబ్బులతో చెప్పులను కొనుగోలు చేసి ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తూ తనకు తోచిన సహాయం చేయాలనే తపన కలిగిన మహేష్‌ను పలువురు గ్రామస్తులు అభినందిస్తున్నారు.

### నియామకం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 6: కాంగ్రెస్ పార్టీ 6వ డివిజన్ అధ్యక్షురాలిగా మల్క అర్చనను నియమిస్తూ శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృచేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

### చర్చలు సఫలం

పాలకుర్తి, సెప్టెంబరు 6: ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మిస్తున్న ప్రహరీ గోడకు ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సరిపడా స్థలాన్ని వదలిపెట్టాలని బామ్లానాయక్ తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ కోరడంతో శుక్రవారం కంపెనీ అధికారులు ఆయనతో చర్చలు జరిపారు. రాజునాయక్ కోరినట్లు అధికారులు స్థలాన్ని వదిలి గోడ నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఆ గ్రామ గౌడ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, సెప్టెంబరు 6: మంథని మండలంలోని ఆరెంద గ్రామంలో పలు మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పరామర్శించారు. గ్రామంలో ఇటీవల కొమ్మిడి కృష్ణారెడ్డి, ఉయ్యాల మల్లమ్మ, తాడబోయిన రాజమ్మలు వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందగా వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించిన పుట్ట మధు విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్ తదితరులు ఉన్నారు.

### టీఆర్‌టీఎఫ్ కార్యవర్గం

ఎలిగేడు, సెప్టెంబరు 6 : మండల టీఆర్‌టీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంగల లక్ష్మీనారాయణ, కోమల్ల సంపత్ కుమార్‌లను శివపల్లి ఎస్సీ కాలనీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా బుర్ర శ్రీధర్, గీతారాణీ, కార్యదర్శిగా గాదె శ్రీవాణి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మూల మహేందర్‌రెడ్డి, భీమ వేణుకుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, అనితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ముప్పవరం రవీందర్‌రావు, పరిశీలకుడిగా రాష్ట్ర కార్యదర్శి పులి అశోక్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలందించాలి

ఎలిగేడు, సెప్టెంబరు 6 : మండల ప్రజలకు అత్యవసర సేవలు అందించాలని మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆమె సందర్శించారు. ముప్పిరితోట, ధూళికట్ట తదితర గ్రామాల ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకుతున్నందున క్యాంపులు నిర్వహించాలని కోరారు. అనంతరం రూ.20వేల విలువగల చెక్కును పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్ణకు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు న్యాతరి పోచయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దపల్లిలో పర్యటించిన సీపీ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 6: వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు, గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌తో కలిసి శుక్రవారం పట్టణంలో పర్యటించారు. వినాయక నిమజ్జనం చేసే ఎల్లమ్మ చెరువును పరిశీలించారు. ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని సందర్శించారు. ఏసీపీ కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్,ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

### వరద బాధితులను ఆదుకోవాలి

అంతర్గాం, సెప్టెంబరు 6: వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, తమ్మనవేణి రాజకొమురయ్య, శంకరయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

### రోడ్లు మరమ్మతు చేయాలి

మంథని, సెప్టెంబరు 6:మంథని డివిజన్‌లోని దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లను రిపేర్ చేయించడానికి చర్యలు తీసుకోవాలని నాయకుడు తోట భాస్కర్ కోరారు. గుంతలమయమైన రోడ్లపై ప్రయాణించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.




### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6: ఐఐటీలో సీటు సాధించిన ఉద్యోగి కుమారుడు అభినయ్‌కు సింగరేణి యాజమాన్యం మంజూరు చేసిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెక్కును శుక్రవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అందజేశారు. ఓసీపీ-3లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్న రామయ్య కుమారుడైన అభినయ్ బీటెక్ కోర్సుకు గాను ఐఐటీలో సీటు సాధించాడు. అభినయ్ ఉన్నత చదువుల నిమిత్తం సింగరేణి రూ. 8లక్షలు మంజురు కాగా మొదటి విడతగా రూ.2లక్షలను జీఎం వారికి అందజేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం, విద్య, వైద్యం కోసం సింగరేణి ఖర్చు చేస్తుందని జీఎం అన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన వారిని ప్రోత్సహించేందుకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ అందసజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఏఐటీయూసీ నాయకుడు శ్యాంసన్ పాల్గొన్నారు.

### అప్రెంటీస్‌షిప్ మేళా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 6: పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో కోర్సులు పూర్తి చేసిన వారు, ఫలితాల కోసం వేచి చూస్తున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం 9.30 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపల్ కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ఉషా ఎలక్ట్రానిక్ ,టాటా ఏరోస్పేస్, ఏం టార్ టెక్నాలజీస్, వరుణ్ మోటార్స్, ఆదర్శ మోటార్, రాణే ఇంజిన్ వాల్వ్, ఐటీసీ టెక్నాలజీస్ హైదరాబాద్, కరీంనగర్ నుంచి వివిధ కంపెనీలు పాల్గొననున్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు రిజిస్టర్ చేసుకుని ఎస్సెస్సీ, ఐటీఐ ధ్రువపత్రాలు, బయోడేటా, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామగిరి, సెప్టెంబరు 6: మండలంలోని రాజాపూర్ గ్రామంలోని వందన ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. 29 సంవత్సరాల అనంతరం కలసి స్నేహితులు గురువులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం గురువులను సత్కరించారు. ముడుసు లక్ష్మణ్, ఉపాధ్యాయులు శేఖర్, శంకర్, రాజేందర్, మధు, దనంజయ్, లక్ష్మణ్, రాజేశం పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 6: రామగుండానికి వరాల జల్లు ప్రకటించిన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు 8వ కాలనీ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాలనీలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వినతిమేరకు వరాలు ఇవ్వడం సంతోషదాయకన్నారు. 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్ నిర్మాణానికి, స్కిల్ డెవలప్‌మెంట్, మహిళ సాధికారత కోసం 24 కోట్ల రూపాయలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మారెల్లి రాజిరెడ్డి, చాగంటి శంకర్, జక్కుల దామోదర్‌రావు, మార్క రాజు, తిరుపతిరెడ్డి, రాజేష్, రాకేష్, సర్వోత్తమ్‌రెడ్డి, మేకల అజయ్, ప్రశాంత్, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

### పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఆదిరెడ్డి

కమాన్‌పూర్, సెప్టెంబరు 6: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా రోగాలు అరికట్టవచ్చని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం డ్రై సందర్భంగా ఎస్సీ సంక్షేమ వసతి గృహం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఎట్టి పరిస్థితుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పిచ్చి మొక్కలు, చెత్త, చెదారాన్ని వెంటనే తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, కార్యదర్శి తిరుపతి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

**ముత్తారం:** మండలంలోని ముత్తారం ఓడేడు గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు వీధుల్లో మండల ప్రజాపరిషత్ అధికారి సురేష్ పర్యటించి నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వహణకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

### వర్గీకరణ సదస్సును విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కమాన్‌పూర్, సెప్టెంబరు 6: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లోని ఇందిరాగార్డెన్‌లో ఈనెల 10న నిర్వహించ తలపెట్టిన ఏబీసీడీ వర్గీకరణ సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా మాదిగల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో సదస్సుకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతంలో ఉన్న మాదిగలకు విద్య, ఉద్యోగ రంగాల్లో, సంక్షేమ పథకాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎమ్మెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్రమౌళి, సీనియర్ నాయకులు చిప్పకుర్తి సత్యనారాయణ, మంథని రామస్వామి, మల్లారపు అరుణ్‌కుమార్, రాజు, కుక్క సతీష్, చిప్పకుర్తి శ్రీనివాస్, మల్యాల తిరుపతి, చిప్పకుర్తి నర్సయ్య, ఆరెల్లి రాజు తదితరులు ఉన్నారు.

### యూనాని వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామగిరి, సెప్టెంబరు 6: మండలంలోని బేగంపేట్ పీహెచ్‌సీలో శుక్రవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యునాని ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. యునాని వైద్యానికి గ్రామంలో అనూహ్య స్పందన లభించింది. వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న సుమారు 80 మంది రోగులకు వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రదీప్, యునాని వైద్యుడు మారుతీ, సీహెచ్‌వో భరత్, హెల్త్ అసిస్టెంట్ సీతారామయ్య, సూపర్‌వైజర్ పుష్పవతి, స్టాఫ్ నర్సులు రమ, రాజమణి, ఉమా, ఫార్మసిస్టులు స్వప్న, రీటా, రవీకుమార్, మేఘమాల, సుధాకర్, ఏఎన్‌ఎంలు మనేమ్మ, ఆశావర్కర్లు భాగ్య, రాజేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.